# ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

- ట్రాఫిక్-3 అడిషనల్ డీసీపీ రవీంద్రారెడ్డి
- పలు ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్.. జరిమానా



మలక్‌పేట ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్‌లో తనిఖీని పరిశీలిస్తున్న టాఫిక్- 3 అడిషనల్ డీసీపీ రవీంద్రారెడ్డి , ట్రాఫిక్ ఏసీపీ చంద్రకుమార్

మలక్‌పేట, మార్చి 4: ట్రాఫిక్ నిబంధనలను పాటించని వాహనదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్- 3 అడిషనల్ డీసీపీ రవీంద్రారెడ్డి అన్నారు. మలక్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అశోక్ కుమార్ ఆధ్వర్యంలో మూసారాంబాగ్, నల్గొండ చౌరస్తా , ఆజంపురా చౌరస్తాలలో మంగళవారం అంబులెన్స్‌ల చెకింగ్, రాంగ్‌రూట్లో రైడింగ్, నంబర్ ప్లేట్ లేకుండా తిరిగే వాహనాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. దీనికి సౌత్ ఈస్ట్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ చంద్రకుమార్‌తో పాటు డీసీపీ హాజరయ్యారు. ఈ సందర్భంగా నంబర్ ప్లేట్ లేకుండా నడుపుతున్న, రాంగ్‌రూట్‌లో వెళ్తున్న వాహనాలను తనిఖీ చేసి జరిమానాలు విధించారు. అదేవిధంగా పేషెంట్ లేకుండా సైరన్లు మోగిస్తూ వెళ్తున్న అంబులెన్స్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహన చోదకులు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటించి, సురక్షిత ప్రయాణాలను కొనసాగించాలని సూచించారు. వాహన చోదకుల సురక్షిత ప్రయాణాల కోసమే ట్రాఫిక్ నియమాలని, వాటిని ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. రాంగ్ రూట్లో డ్రైవ్ చేయడం ప్రమాదకరమని, నంబర్ ప్లేట్లు లేకుండా వాహనాలు నడపడం మోటార్ వెహికల్ చట్టం ప్రకారం నేరమన్నారు. ఇటీవల కాలంలో పేషెంట్లు లేకుండా అంబులెన్సుల డ్రైవర్లు సైరన్‌ను మోగిస్తూ వెళ్తూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నారని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ట్రాఫిక్ నియంత్రణతో పాటు ప్రమాదాల నివారణకు మలక్‌పేట ట్రాఫిక్ పోలీసులు చేపట్టిన ఈ స్పెషల్ డ్రైవ్‌లు అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మలక్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్, ఎస్సైలు రాము, రామస్వామి, యాదయ్య, వినోద్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

## మినీ అంగన్‌వాడీ కార్యకర్తల అరెస్ట్



వనస్థలిపురం, మార్చి 4 : తమ సమస్యల పరిష్కారం కోసం మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు మంగళవారం ఇందిరా పార్కు వద్ద ధర్నాతోపాటు సీఎం ఇంటి ముట్టడికి పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో వనస్థలిపురం ప్రాంతంలో ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు కార్యక్రమానికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. వారి ఇండ్లలోకి వెళ్లి అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు రజిత, రజినీ, ఉమారాణి, నాగరాణి, తదితరులను అదుపులోకి తీసుకొని స్టేషన్‌లో ఉంచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ పట్ల ప్రభుత్వం వివక్ష చూపిస్తుందని, తాము అన్ని రకాల సేవలు అందిస్తున్నామని, అయినా కూడా సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేస్తుందని అన్నారు. వెంటనే తమ సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

## ఎల్ఆర్ఎస్ రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

మేడ్చల్ కలెక్టరేట్, మార్చి 4:ఎల్ఆర్ఎస్ రాయితీని సద్వినియోగం చేసుకోవాలని దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ ఎ. నాగమణి అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం మున్సిపల్ పరిధిలోని కాలనీల అధ్యక్షులు, వెంచర్ల యాజమానులు, ప్లాట్ల దారులతో అనధికార లేఔట్ లో ఉన్న ప్లాట్లు లేఔట్ క్రమబద్ధీకరణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సేవలు అందుబాటులో ఉంటాయని అన్నారు. సెలవు దినాల్లో కూడా ఈ సేవలు ఉంటాయని, ఏమైనా సందేహాలు ఉంటే ఎస్ఆర్ఎస్ హెల్ప్ డెస్క్‌ను సంప్రదించాలని, అన్‌లైన్ సదుపాయం లేని వారు అన్‌లైన్ పేమెంట్ పై అవగాహన లేనివారు ఎల్ఆర్ఎస్ హెల్ప్ డెస్క్ ద్వారా అన్‌లైన్ ద్వారా ఫీజు చెల్లించవచ్చని తెలిపారు.

## గ్రామాల అభివృద్ధికి కృషి

### ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని కలిసిన సామ ప్రకాశ్‌రెడ్డి

కందుకూరు, మార్చి 4 : అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. మండల పరిధిలోని కొత్తగూడ గ్రామ అభివృద్ధికి నిధులను మంజూరు చేయాలని కోరుతూ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సామ ప్రకాశ్‌రెడ్డి మంగళవారం ఎమ్మెల్యేను కలిసి వివరించారు. కొత్తగూడ గ్రామం నుంచి కొత్తూరుకు రోడ్డు, మండల కేంద్రం నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ కస్తూర్బా బాలికల పాఠశాల వరకు సీసీ రోడ్డు, కొత్తగూడ ఎక్స్ రోడ్ పరిధిలో గల సీతారామశాస్త్రీనగర్, హైదరాబాద్ టెక్నో స్కూల్ కాలనీలో అండర్ గ్రౌండ్, సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని, ప్రతిపక్షంలో ఉన్నా ప్రభుత్వంతో కొట్లాడి నియోజకవర్గానికి అత్యధిక నిధులు తీసుకొస్తానని అన్నారు. ప్రజలు తనపైన పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయనని అన్నారు. రాజకీయాలకతీతంగా అభివృద్ధి చేయడమే తన లక్ష్యం అని పేర్కొన్నారు. జెండాలను పక్కనపెట్టి అభివృద్ధికి తనతో కలిసి రావాలని కోరారు. కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## పద్మశాలి మహాసభను విజయవంతం చేయాలి



పద్మశాలి మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గణేశ్ నేత, తదితరులు

ఆర్కేపురం, మార్చి 4: ఈనెల 9న నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో నిర్వహిస్తున్న పద్మశాలి మహాసభను విజయవంతం చేయాలని పద్మశాలి సంఘం ఎల్బీనగర్ సర్కిల్ అధ్యక్షుడు పున్న గణేశ్ నేత పిలుపునిచ్చారు. మంగళవారం పద్మశాలి మహాసభ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పద్మశాలీలు ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబాటుతనానికి గురవుతున్నారని, పద్మశాలి సమాజ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలనే లక్ష్యంతో అఖిలభారత, తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో మహా సభను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మహాసభకు ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరవుతున్నట్లు తెలిపారు. పద్మశాలి కుల బంధువులు అధిక సంఖ్యలో హాజరై మహాసభను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, రవితేజ, శ్రవణ్, రమేశ్, సూర్యకాంతం, రవీందర్, వెంకటేశం, జగన్నాథం, చంద్రమౌళి, రమేశ్, శ్రీనివాసులు, శ్రీనివాస్, గోపాల్, సంధ్యారాణి, వర్ణలీల, భారతమ్మ, పూర్ణిమ, అశ్విత, శంకర్, వెంకటేశ్, రమేశ్, మహేశ్ ఉన్నారు.

## ఎంబీఏ కోర్సుల పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని ఎంబీఏ కోర్సుల పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ (ఈవినింగ్), ఎంబీఏ (టెక్నాలజీ మేనేజ్మెంట్- ఈవినింగ్) కోర్సుల మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను ఈ నెల 11వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు.

## ఏవియేషన్, ఉపాధి అవకాశాలపై అవగాహన



హయత్ నగర్, మార్చి 4 : హయత్‌నగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఏవియేషన్ రంగం, ఉపాధి అవకాశాలపై కెరీర్ గైడెన్స్ సెల్, తెలంగాణ స్కిల్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురేశ్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ భాను ప్రసాద్ హాజరై మాట్లాడుతూ.. డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు అన్ని రంగాల్లో ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని పేర్కొన్నారు. రాంబాబు మాట్లాడుతూ.. విద్యార్థులు విమానయాన రంగంలో ఉపాధి అవకాశాలు నైపుణ్య అభివృద్ధి, వివిధ ప్రభుత్వ, కార్పొరేట్ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలపై వివరించారు. కెరీర్ గైడెన్స్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. విద్యార్థులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని మల్టీ నేషనల్ కంపెనీ, కార్పొరేట్ రంగాల్లో అవకాశాలు వినియోగించుకోవాలని సూచించారు . ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డి, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ నరసింహ, టిఎస్.కె.సి కోఆర్డినేటర్ మట్ల, నాగరాజు, నరసింహ, మల్లేశం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జాబ్ మేళాకు అనూహ్య స్పందన

**మేడ్చల్ కలెక్టరేట్** :జాబ్‌మేళాకు మహిళల నుంచి అనూహ్య స్పందన వచ్చిందని నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ చంద్రారెడ్డి అన్నారు. మంగళవారం స్టార్ ఫంక్షన్ హాల్‌లో ఫాక్స్‌కాన్ ఎలక్ట్రానిక్స్ కంపెనీ నిర్వహించిన జాబ్‌మేళాలో 550 మంది మహిళలు పాల్గొన్నారు. అర్హత కలిగినవారికి తమ సంస్థలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని కంపెనీ నిర్వాహకులు తెలిపారు.

## దోమల నివారణకు చర్యలు

మలక్‌పేట, మార్చి 4: మూసీ పరివాహక ప్రాంతంలో దోమల నివారణకు డ్రోన్‌తో రసాయనాలను పిచికారి చేస్తున్నట్లు మూసారాంబాగ్ డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్ రెడ్డి అన్నారు. రెండు రోజులపాటు ఈ కార్యక్రమం కొనసాగుతుందని, అందులో భాగంగా మంగళవారం మూసారాంబాగ్ బ్రిడ్జి , ధోబీఘాట్ వద్ద మూసీనీటిపై డ్రోన్‌తో రసాయనాలను పిచికారి చేసినట్లు ఆమె తెలిపారు. డివిజన్‌లో దో మల నివారణకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని, కాలనీల్లో ఫాగింగ్ చేయించడంతోపాటు మురికినీటి గుంతల్లో, మూ సీ నీటిపై రసాయనాలను పిచికారి చేయిస్తున్నామని తెలిపారు. కాలనీల్లో చెత్త పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు తొలగించడం జరుగుతుందని, దోమల నివారణకు డివిజన్‌లో అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంటమాలజీ సూపర్ వైజర్ గుండప్ప, సిబ్బంది సురేశ్, వెంకటేశ్, ప్ర దీప్, రాములు, కొంగర ప్రవీణ్ పాల్గొన్నారు.

## మాదన్నపేట మార్కెట్లో ఆకస్మిక తనిఖీ



మాదన్నపేట మార్కెట్లో కూరగాయలను పరిశీలిస్తున్న మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్

సైదాబాద్, మార్చి 4: మాదన్నపేట కూరగాయల మార్కెట్లో మంగళవారం తెల్లవారుజామున హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ కోట్ల శ్రీనివాస్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మార్కెట్‌కు వచ్చే కూరగాయలు, ఆకుకూరల వివరాలను, నిల్వ, ధరలు , రైతుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా మార్కెట్లో పారిశుధ్య పనులను పరిశీలించి.. సిబ్బందికి తగు సూచనలు చేశారు. మార్కెట్లో ఆకస్మిక తనిఖీలు చేసి.. అక్కడ జరుగుతున్న వ్యాపార, కార్యక్రమాలు రైతులు, వ్యాపారస్తుల సమస్యలపై ఆరా తీసి, పలు అంశాలను పరిశీలించారు.

## అంగన్‌వాడీ కేంద్రం పిల్లలకు కిట్లు అందజేత



అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ సిల్వేరి సాంబశివ కిట్లు అందజేశారు. జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో ఉన్న రాయల్ కాలనీలో ఉన్న అంగన్‌వాడీ స్కూల్‌కు 25 కిట్లు ఇచ్చారు. చిన్నారుల అవసరాలను గుర్తించి వారికి సాయం అందించినట్లు తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తృతంగా చేపడుతామని అన్నారు. సేవా దృక్పథంతో పనిచేస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్, తదితరులు ఉన్నారు.
*– బడంగ్‌పేట్, మార్చి 4*

## ముమ్మరంగా నిర్మాణ పనులు



మలక్ పేట, మార్చి 4: మలక్‌పేట రైల్వే స్టేషన్ వద్ద ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చేపట్టిన కొత్త ఆర్‌యూబీ పనులు పూర్తి కావచ్చాయి. ఈ నెలాఖరులోగా ప్రారంభోత్సవం కానున్న బ్రిడ్జి వద్ద ప్రస్తుతం అప్రోచ్ రోడ్డు నిర్మాణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. బ్రిడ్జి వద్ద నిర్మాణ పనులను సంబంధిత అధికారులతో పాటు మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే ప్రధాన నాలాపై స్లాబ్ నిర్మాణం రిటర్నింగ్ వాల్ పనులు పూర్తవగా అప్రోచ్ రోడ్డు నిర్మాణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. అదేవిధంగా రైల్వే బ్రిడ్జి పక్కన ఉన్న పద్మానగర్ కాలనీకి వెళ్లేందుకు ప్రజలకు ఎలాంటి ఆటంకం కలగకుండా రహదారి నిర్మాణ పనులు కూడా పూర్తి చేశారు. ఈ ఆర్‌యూబీ వినియోగంలోకి వస్తే మలక్‌పేట రైల్వే బ్రిడ్జి వద్ద దశాబ్దాల ట్రాఫిక్ సమస్య శాశ్వతంగా పరిష్కారం కానుంది.

## సీసీ కెమెరాల ఏర్పాటుకు దాతలు సహకరించాలి



కందుకూరు, మార్చి 4 : సీసీ కెమెరాల ఏ ర్పాటుకు దాతలు సహకరించాలని గ్రీన్ ఫా ర్మాసిటీ సీఐ కృష్ణంరాజు కోరారు. మండల పరిధిలోని సాయిరెడ్డిగూడ గ్రామానికి చెంది న మండల బీఆర్ఎస్ నాయకుడు సప్పిడి గో వర్ధన్ .. గ్రామంలో ఏర్పాటు చేసే సీసీ కెమెరాల ఏర్పాటుకు తన వంతు సహకారంగా రూ.20 వేలను పోలీస్ స్టేషన్‌లో సీఐకి అం దజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలను ఏ ర్పాటు చేసుకోవాలని కోరారు. ఒక్కో సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని తెలిపారు. సీసీ కెమెరాలను ప్రతి షాప్, ఇండ్ల వద్ద ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో దోపిడీలు, దొంగతనాలు, తగాదాలు, ఘర్షణలు చోటు చేసుకున్నట్లయితే వాటిని తక్షణమే గుర్తించే ఆస్కారం ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో శేఖర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఆర్కేపురం, మార్చి 4 : విద్యుత్ నగర్, సౌత్ అండ్ పార్క్, జైన్ మందిర్, కొత్తపేట, విష్ణు థియేటర్ 11 కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ విద్యుత్ శాఖ డీఈ కేకే రామకృష్ణ తెలిపారు. విద్యుత్ నగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు లక్ష్మీ నగర్ కాలనీ, ఎస్‌బీఐ కాలనీ, ఓమ్ని హాస్పిటల్, కొత్తపేట ప్రధాన రహదారి పరిసర ప్రాంతాల్లో, సౌత్ అండ్ పార్క్ ఫీడర్ పరిధిలో సౌత్ ఇండియన్ పార్క్, సూర్యోదయ కాలనీ, సెంట్రల్ బ్యాంక్ కాలనీ, పరిసర ప్రాంతాల్లో, జైన్ మందిర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జైన్ మందిర్, మారుతీనగర్, బాపు కాంప్లెక్స్, పోస్ట్ ఆఫీస్ పరిసర ప్రాంతాల్లో, కొత్తపేట ఫీడర్ పరిధిలో కొత్తపేట విలేజ్ పరిసర ప్రాంతాల్లో, విష్ణు థియేటర్ ఫీడర్ పరిధిలో సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు చంద్రపురి కాలనీ, ఎల్పీటీ మార్కెట్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

## యువకుడు ఆత్మహత్య

కందుకూరు, మార్చి 4 : ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని పులిమామిడి గ్రామానికి చెందిన రేవెళ్లె యేసయ్య కుమారుడు రాజేశ్(23) మంగళవారం ఉదయం ఇంట్లో పైకప్పుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు.

## గొంతెండుతున్నది..

- వేసవికాలం రాకముందే మొదలైన నీటి కష్టాలు..
- ట్యాంకర్ డ్రైవర్లకు నెలవారీ డబ్బులు ఇస్తేనే తాగునీరు
- ఇబ్బందుల్లో సింగరేణి గుడిసెవాసులు




జలమండలి సరఫరాచేసే నీటి కోసం ఇండ్ల ముందు డ్రమ్ములు పెట్టుకున్న సింగరేణి గుడిసెవాసులు

సైదాబాద్, మార్చి 4: ఎండాకాలం రాకముందే సింగరేణి గుడిసెవాసులకు తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. నగరంలోనే అతిపెద్ద బస్తీగా పేరుపొందిన సింగరేణి గుడిసెవాసులకు నల్లా కనెక్షన్లు లేకపోవడంతో జలమండలి అధికారులు సరఫరా చేసే ట్యాంకర్లపై ఆధారపడి జీవిస్తున్నారు. గుడిసెవాసులు నివసించే స్థలం న్యాయస్థానంలో వివాదంలో కొనసాగుతోన్నది. దీంతో ప్రభుత్వం ఇప్పటివరకు వ్యక్తిగత నల్లా, కరెంట్ కనెక్షన్లు ఇవ్వలేదు. అనేక ఏళ్లుగా గుడిసెవాసులు తాగునీటి కోసం పడరాని పాట్లు పడుతున్నారు. మంచినీటి కోసం గుడిసెలముందు డ్రమ్ములను ఏర్పాటు చేసుకొని జలమండలి ట్యాంకర్ల ద్వారా సరఫరా నీటిపైనే ఆధారపడుతున్నారు.


ఐఎస్ సదన్ పరిధిలోని వైశాలినగర్ రిజర్వాయర్ నుంచి ప్రతిరోజు సుమారు 100కు పైగా ఫ్రీ ట్యాంకర్ల ద్వారా ప్రభుత్వం సింగరేణి కాలనీ, రోషన్‌దౌల, తదితర ప్రాంతాలకు తాగునీటిని సరఫరా చేస్తున్నది. అయితే.. ప్రభుత్వం సరఫరా చేసే ట్యాంకర్లు పక్క దారిపడుతున్నాయని ఆరోపణలు వస్తున్నాయి. ప్రతి గుడిసెవాసి వద్ద నుంచి ట్యాంర్ల డ్రైవర్లు రూ.60ల చొప్పున వసూలు చేస్తున్నారని, డబ్బులు ఇస్తేనే నీళ్లు, లేందటే నీళ్లు డ్రమ్ముల్లో నింపరని బాధితులు వాపోతున్నారు.

### ఇబ్బందులు పడుతున్నాం..



జలమండలి అధికారులు ట్యాంకర్ల ద్వారా సరఫరాచేసే నీళ్లు సరిపోక ఇబ్బందులు పడుతున్నాం. ట్యాంకర్ల డ్రైవర్లు రెండు డ్రమ్ములకే నీళ్లు నింపుతుండటం తో తాగడానికి , గృహ అవసరాలకు సరిపోక అవస్థలు పడుతున్నాం. ఎండాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని సరిపడ నీళ్లు సరఫరా చేసి గుడిసెవాసుల దాహార్తిని తీర్చాలి. మా కష్టాలను ప్రజా ప్రతినిధులు, అధికారులు పట్టించుకుని నీటి ఇబ్బందులు తొలగించాలి.
*– జంగయ్య, సింగరేణి గుడిసెవాసి*

### దాహార్తిని తీర్చండి..



సింగరేణి గుడిసెలకు సరఫరాచేసే ట్యాంకర్ల సంఖ్య ను పెంచాలి. ట్యాంకర్లపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో సిబ్బంది, డ్రైవర్లు కుమ్మక్కు కావడంతో మార్గ మధ్యలోనే ట్యాంకర్లు పక్కదారి పడుతున్నాయి. జలమండలి ఉచితంగా సరఫరా చేసే తాగునీటి ట్యాంకర్ల డ్రైవర్లు నెలవారీగా గుడిసేవాసుల వద్ద వసూలు చేస్తున్నారు. ఎండా కాలంలో గుడిసెవాసులకు తాగునీటి ఇబ్బందులు లేకుండా అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవాలి.
*– తుకారాంనాయక్, సింగరేణి గుడిసెవాసుల అధ్యక్షుడు*

## మార్కెటింగ్ శాఖ డైరెక్టర్‌కు సత్కారం..



వ్యవసాయ మార్కెటింగ్ శాఖ డైరెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్న సురేందర్ మోహన్ (ఐఏఎస్)ను మంగళవారం కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరిస్తున్న టీఎన్జీవో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉద్యోగుల రాష్ట్ర ఫోరం అధ్యక్షుడు చిలక నరసింహారెడ్డి, కార్యదర్శి ముక్రం, సహా అధ్యక్షుడు వెంకటేశం, సెంట్రల్ యూనియన్ ఈసీ మెంబర్ సంతోశ్, హైదరాబాద్ ఎస్‌జీఎస్ దామోదర్, జనరల్ సెక్రెటరీ వెంకట్ రెడ్డి, ఆమనగల్లు కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి
*–మలక్‌పేట/ఆర్కే పురం, మార్చి 4*

## మితిమీరుతున్న మాజీ కార్పొరేటర్ల ఆగడాలు..!

బడంగ్‌పేట్, మార్చ్ 4: బడంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారపార్టీకి చెందిన కొందరు తాజా మాజీ కార్పొరేటర్ల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. కార్పొరేటర్ల పదవీకాలం జనవరి మాసంతో ముగిసిపోయినా.. నిత్యం మున్సిపల్ ఆఫీసులోని తిష్టవేస్తూ పనుల కోసం అధికారులపై ఒత్తిడి చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. మాట వినకపోతే బదిలీ చేస్తామని బెదిరింపులకు కూడా పాల్పడుతున్నారని ప లువురు అధికారులు వాపోతున్నారు. ఇలా బెదిరింపులకు పాల్పడితే ఇక్కడ పనిచేయలేమని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇతర ప్రాంతాలకు బదిలీ చేసుకోవడానికి కొంతమంది అధికారులు ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే కొంతమంది నెలల తరబడి సెలవులు పెట్టి వెళ్తున్నారు. అధికారులకే కాకుండా ఔట్‌సోర్సింగ్‌లో పనిచేసేవాళ్లకు బెదిరింపులు తప్పడం లేదు. అలాగే.. నూతనంగా నిర్మించే నిర్మాణదారులను సైతం బెదిరిస్తున్నట్లు సమాచారం. అలాగే టెండర్ వేయకుండా ముందస్తు పనులు చేయాలని చెప్పి ఇప్పుడు పట్టించుకోవడంలేదని పలువురు కాంట్రాక్టర్లు వాపోతున్నారు. అధికారులతో మాట్లాడి ఒప్పిస్తామని భరోసా ఇచ్చి ఇప్పుడు చేతులు దులుపుకుంటున్నారని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి.. అధికార పార్టీకి చెందిన మాజీ కార్పొరేటర్ల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

## వివిధ కోర్సుల పరీక్ష ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ దూరవిద్య కేంద్రమైన ప్రొఫెసర్ జి.రామ్‌రెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ద్వారా అందించే వివిధ కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ రెగ్యులర్ పరీక్ష ఫలితాలతో పాటు డిగ్రీ కోర్సుల సప్లమెంటరీ రివాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్సైట్ www. osmania. ac. in లో చూసుకోవాలని సూచించారు.

## పీహెచ్ డీ సబ్మిషన్ గడువు పొడిగించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని 2018 బ్యాచ్ పరిశోధక విద్యార్థులు థీసెస్ సమర్పించేందుకు గడువును ఏడాది పొడగించాలని ఏఐఎస్ఎఫ్ డిమాండ్ చేసిం ది. ఓయూ అధ్యక్ష కార్యదర్శులు లెనిన్, నెల్లి సత్య ఒక ప్రకటన విడుదల చేశారు. 2018 పరిశోధక విద్యార్థుల ప్రవేశాలు 2019 వరకు సాగాయన్నారు. కరోనాతో రెండేళ్ల కాలా న్ని పరిశోధకులు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫెలోషిప్ లేక పరిశోధనలు ముందుకు సాగలేదని వాపోయారు. యూజీసీ రెండేండ్లు పొడిగించినప్పటికీ ఓయూ పాటించడం లేదని మండిపడ్డారు. గడువుపై ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం వల్ల గ్రామీణ పేద విద్యార్థులు నష్టపోతున్నారని ఇప్పటికైనా అధికారులు స్పందించి న్యాయం చేయాలన్నారు.

## త్వరలో కాలనీల్లో అభివృద్ధి పనులు



కాలనీలో పర్యటించి సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి

మన్సూరాబాద్, మార్చి 4: కాలనీల్లో అభివృద్ధి పనుల కోసం త్వరలో పెద్ద ఎత్తున నిధులు మంజూరు కానున్నాయని మనసురాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి తెలిపారు. మనసురాబాద్ డివిజన్ పరిధి వివేకానందానగర్, జడ్జెస్ కాలనీ, వీరన్న గుట్ట, పవనగిరి కాలనీ ఫేస్-3 లో మంగళవారం ఆయా కాలనీల సంక్షేమ సంఘం సభ్యులతో కలిసి పర్యటించి సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ..త్వరలో విడుదల కాబోయే నిధులతో కాలనీలో సీసీ రోడ్లు, యూజీడీ పనులను ప్రారంభించి అభివృద్ధిని పరుగులు పెట్టిస్తానని తెలిపారు. కాలనీల వాసులు రోడ్లను ఆక్రమించి ర్యాంపులు వేసి ట్రాఫిక్ సమస్యలను సృష్టించవద్దన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ కాలనీల సంక్షేమ సంఘం ప్రతినిధులు సైదిరెడ్డి, పవన్, నరసింహ యాదశ్, హరి ప్రసాద్, పుష్పలత, సాయిలు గౌడ్, సత్యపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE HIGH COURT OF TELANGANA AT : HYDERABAD
CRP NO. 2246 OF 2024
Between:
1. P. RAMDAS ...Petitioner/JDR No. 2
and
M/s. Ashrita Chit Funds Pvt. Ltd. and 6 others ....Respondents/Judgement Debtors No. 1 & 3 to 6
NOTICE TO 2,3,4 AND 5 RESPONDENTS
2. P. Rajeswar, S/o. Late R. Rachappa, R/o. Flat No. 501, VSR Homes, PSR Enclave, Near Aparna Hill Park, Chanda Nagar, Hyderabad.
3. K. Ramesh, S/o. R. Balaiah, R/o. H.No. 9-3-179, Rozimental Bazar, Hyderabad.
4. M. Thimothi, S/o. M. Sambasiva Rao, R/o. Qrs No. 48/13, Lab Qtrs, DRDO Township, Kanchanbagh, Hyderabad.
5. R. Venkata Ramulu, S/o. R. Rachappa, R/o. LIG 213, 4, KPHB, 4th Phase, Kukatpally, Hyderabad.
In the above said CRP. No. 2246/2024 by my client Ramdas against M/s. Ashrita Chit Fund Pvt. Ltd. and 6 others before the Hon'ble High Court of Telangana. The Hon'ble High Court directed the petitioner Ramdas to send notices to Respondents 2-5 through paper publication. So, take notice that you being the 2-5 Respondents in CRP No. 2246/2024 is posted on 19-03-2025 for your appearance before the Hon'ble High Court of Telangana by person or through Counsel without fail, otherwise the matter will be heard in your absence.
Hence this notice by the orders of the Hon'ble High Court.
NAGA DURGA SAROJA DHULIPALA
ADVOCATE
Counsel for the Petitioner
Date: 04-03-2025
Place: Hyderabad